ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
మెదక్ సంపుటి: 19 సంచి13 ఆదివారం, 14 సెప్టెంబర్ 2025 పేజీలు: 06 వెల: రూ.1
Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com

# ఈశాన్యభారతం దేశానికే గ్రోత్ ఇంజిన్

**మిజోరంలో రూ. 9,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు ప్రధాని శ్రీకారం**
**దేశానికి ఈశాన్య రాష్ట్రాలు వృద్ధి చోదక శక్తిగా మారాయని వ్యాఖ్య**
**కీలకమైన బైరబీ-సైరంగ్ రైల్వే ప్రాజెక్టును ప్రారంభించిన ప్రధాని**
**ఢిల్లీ, కోల్‌కతా, గువాహటికి మూడు కొత్త రైలు సర్వీసుల ప్రారంభం**
**గత ప్రభుత్వాలు ఈశాన్యంలో ఓటు బ్యాంకు రాజకీయాలు చేశాయని విమర్శ**



హైదరాబాద్, ప్రజాస్వరం :

ఈశాన్య భారతదేశం ఇప్పుడు దేశానికే ఒక 'గ్రోత్ ఇంజిన్' (వృద్ధి చోదక శక్తి) అని, గత 11 ఏళ్లలో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి సాధించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శనివారం మిజోరంలో పర్యటించిన ఆయన, రాష్ట్రంలో రూ. 9,000 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఒకప్పుడు 'సరిహద్దు రాష్ట్రం'గా పిలిచే ఈశాన్యం, ఇప్పుడు దేశానికి 'ఫ్రంట్ రన్నర్'గా మారిందని ఆయన అభివర్ణించారు. ఈ పర్యటనలో భాగంగా అత్యంత ..మిగతా 2లో

# నిండుకుండలా జంట జలాశయాలు

**ఫుల్ ట్యాంక్ లెవెల్‌కి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్**
**ఉస్మాన్ సాగర్ ఫుల్ ట్యాంక్ లెవెల్ 1790 అడుగులు కాగా, 1789.25 అడుగులకు చేరిన నీటిమట్టం**
**హిమాయత్‌సాగర్ 1763.50 కాగా, ప్రస్తుతం 1762.80 అడుగులకు చేరిన నీటిమట్టం**

హైదరాబాద్, ప్రజాస్వరం :

భారీగా కురుస్తున్న వర్షాలతో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాలకు వరద కొనసాగుతోంది. వరద తాకిడికి ఫుల్ ట్యాంక్ లెవెల్‌కి చేరాయి. ఉస్మాన్ సాగర్ ఫుల్ ట్యాంక్ లెవెల్ 1790 అడుగులు కాగా.. 1789.25 అడుగులకు చేరిన నీటిమట్టం.. హిమాయత్ సార్ ఫుల్ ట్యాంక్ లెవెల్ 1763.50 కాగా.. ..మిగతా 2లో



# ఉప ఎన్నికలు రావడం ఖాయం



**దమ్ముంటే ఆ 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలి: కేటీఆర్ సవాల్**
**గ్రూప్1 పోస్టులను రూ.1,700 కోట్లకు అమ్ముకున్నారని తీవ్ర ఆరోపణ**
**యూరియాను కాంగ్రెస్ నేతలు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని మండిపాటు**

హైదరాబాద్, ప్రజాస్వరం

తెలంగాణ రాజకీయాలు మరోమారు వేడెక్కాయి. పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేల విషయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల చేత రాజీనామాలు చేయించి ఎన్నికలకు వస్తే ఎవరి సత్తా ఏమిటో తేల్చుకుందామని అన్నారు. "రేవంత్ రెడ్డి నీకు దమ్ముంటే, నీవు మగాడివైతే ఆ 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించు. ఎన్నికల్లో చూసుకుందాం" అని వ్యాఖ్యానించారు. రాబోయే ఆరు నుంచి తొమ్మిది నెలల్లో రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. గద్వాల బీఆర్ఎస్ సభలో కేటీఆర్ మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఆయన ..మిగతా 2లో



# కృష్ణా జలాల్లో హక్కు కోసం కసరత్తు

**కృష్ణా జలాల్లో తెలంగాణా హక్కు కోసం రేవంత్ రెడ్డి ఆదేశాలు**
**ఢిల్లీ ట్రిబ్యునల్‌లో 904 టీఎంసీల సాధనపై దృష్టి**
**కేసీఆర్ నిర్లక్ష్యం వల్ల ఏపీకి లాభం, తెలంగాణకు నష్టం**
**శ్రీశైలం, నాగార్జునసాగర్ జల విద్యుత్ ప్రాజెక్టులకు ప్రమాదం**


హైదరాబాద్, ప్రజాస్వరం

కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను సాధించి తీరాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి న్యాయ నిపుణులను, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులను అప్రమత్తం చేశారు. కృష్ణాలో నికర జలాలైనా, మిగులు జలాలైనా, వరద జలాలైనా సరే.. తెలంగాణాకు చెందాల్సిన నీటివాటాలో ఒక చుక్క నీరు కుడా వదులుకునేది లేదని ముఖ్యమంత్రి అన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 904 టీఎంసీల నీటి వాటాను సాధించుకునేందుకు పట్టుబట్టాలన్నారు. అందుకు అవసరమైన ఆధారాలన్నీ వెంటనే సిద్ధం చేసి న్యాయ నిపుణులకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఢిల్లీలో కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ విచారణలో తెలంగాణ తుది వాదనలు వినిపించాల్సి ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. స్వయంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి ఈ విచారణలో పాల్గొంటారని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణా ప్రభుత్వం అనుసరించాల్సిన వైఖరిపై శనివారం ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ ..మిగతా 2లో



## నేపాల్ ప్రధానికి మోదీ అభినందనలు

**నేపాల్ తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సుశీల కార్కీ**
**దేశ చరిత్రలో తొలి మహిళా ప్రధానిగా నిలిచిన సుశీల**
**జెన్-జెడ్ యువత నిరసనలతో కుప్పకూలిన ఓలీ ప్రభుత్వం**
**2026 మార్చి 5న సార్వత్రిక ఎన్నికలు జరపనున్న తాత్కాలిక ప్రభుత్వం**
02



## మూసీ ఉగ్రరూపం..

**హైదరాబాద్‌లో ముసారాంబాగ్ బ్రిడ్జిపై రాకపోకల బంద్**
**హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ గేట్ల ఎత్తివేతతో పెరిగిన ప్రవాహం**
**గోల్నాక బ్రిడ్జిపై భారీగా పెరిగిన ట్రాఫిక్ రద్దీ**
**నార్సింగ్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు కూడా మూసివేత**
05

# రూ.500 కోట్ల భూమి సేఫ్

**శంషాబాద్‌లో 12 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా**
**భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి, ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు**
02






## నిజామాబాద్‌లో ఉగ్రమూకలు

**కాంగ్రెస్ పాలనలో సమాజానికి ముప్పు**
**లా అండ్ ఆర్డర్ సరిగా పనిచేయడం లేదు**
**జిల్లాలో ఉగ్రవాద చర్యలను అరికట్టాలి**
**స్పందించిన ఎంపీ ధర్మపురి అరవింద్**
02

# బీసీసీఐ బాస్ రేసులో హర్భజన్ సింగ్

**భజ్జీ పేరును ప్రతిపాదించిన పంజాబ్ క్రికెట్ అసోసియేషన్**
**ప్రస్తుతం ఆమ్ ఆద్మీ పార్టీ తరపున రాజ్యసభ సభ్యుడిగా హర్భజన్**
**ఈ నెల 28న బీసీసీఐ అధ్యక్ష పదవికి ఎన్నికలు**
**ఇటీవల వినిపించిన సచిన్ పేరు.. ఖండించిన ఆయన టీమ్**
**నామినేషన్ల ప్రక్రియపై త్వరలో స్పష్టత**
02



# ఊరికే ఎక్కువ చెబితే వాయిదా వేస్తా

**సుప్రీంకోర్టులో మరోసారి వినిపించిన తెలుగు మాటలు**
**కాకినాడ దంపతుల విడాకుల కేసు విచారణ**
**భార్యాభర్తలతో తెలుగులో మాట్లాడిన జస్టిస్ ఎస్వీఎన్ భట్టి**
**కుమారుడి కోసం రూ.45 లక్షల సెటిల్‌మెంట్‌కు అంగీకారం**
**భారతీయ తల్లుల గురించి జస్టిస్ భట్టి కీలక వ్యాఖ్యలు**
**జంటకు విడాకుల మంజూరు**
**పాస్‌పోర్ట్ తిరిగివ్వాలని అధికారులకు ఆదేశం**

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

దేశ సర్వోన్నత న్యాయస్థానంలో చాలాకాలం తర్వాత మరోసారి తెలుగు భాష వినిపించింది. కాకినాడ దంపతుల విడాకుల కేసు విచారణ సందర్భంగా జస్టిస్ ఎస్వీఎన్ భట్టి స్వయంగా భార్యాభర్తలతో తెలుగులో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. శుక్రవారం జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లాతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. గతంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎన్వీ రమణ కూడా ఓ కేసులో ఇలాగే తెలుగులో మాట్లాడి దంపతుల మధ్య ..మిగతా 2లో



# ఈశాన్య భారతం దేశానికే 'గ్రోత్ ఇంజిన్

మొదటిపేజీ తరువాయి

కీలకమైన 51.38 కిలోమీటర్ల బైరబీ సైరంగ్ రైల్వే ప్రాజెక్టును ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. దీంతో పాటు ఐజ్వాల్‌ను దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, కోల్‌కతా, గువాహటిలతో కలిపే మూడు కొత్త రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కొత్త రైల్వే లైన్, సర్వీసులతో మిజోరం కనెక్టివిటీ గణనీయంగా మెరుగుపడనుంది. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'కాలాదాన్ మల్టీమోడల్ ట్రాన్సిట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్ట్' గురించి ప్రస్తావించారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే మిజోరంతో పాటు ఇతర ఈశాన్య రాష్ట్రాలు నేరుగా బంగాళాఖాతంతో అనుసంధానం అవుతాయని తెలిపారు. మయన్మార్ మీదుగా సాగే ఈ రవాణా కారిడార్, భారతదేశ 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'లో భాగమని, ఇది ఈ ప్రాంతంలో వాణిజ్యం, పర్యాటకాన్ని కొత్త శిఖరాలకు చేరుస్తుందని మోదీ వివరించారు.గతంలో అధికారంలో ఉన్న పార్టీలు ఈశాన్యంలో కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు చేశాయని, వారి వైఖరి వల్లే ఈ ప్రాంతం తీవ్రంగా నష్టపోయిందని ప్రధాని విమర్శించారు. "మా ఆలోచన, ప్రణాళికలు వేరు. ఈ ప్రాంతంలో శాంతి, అభివృద్ధిని తీసుకురావడమే మా లక్ష్యం. రైలు, రోడ్డు, వాయు, జల మార్గాల కనెక్టివిటీని ఇప్పటికే గణనీయంగా మెరుగుపరిచాం, భవిష్యత్తులో మరింత విస్తరిస్తాం" అని ప్రధాని స్పష్టం చేశారు. మిజోరం పర్యటన అనంతరం ప్రధాని మణిపూర్‌కు బయలుదేరి వెళ్లనున్నారు. అక్కడ చురచంద్‌పూర్, ఇంఫాల్‌లలో సుమారు రూ. 8,500 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు.

# నిజామాబాద్‌లో ఉగ్రమూకలు

- **కాంగ్రెస్ పాలనలో సమాజానికి ముప్పు**
- **లా అండ్ ఆర్డర్ సరిగా పనిచేయడం లేదు**
- **జిల్లాలో ఉగ్రవాద చర్యలను అరికట్టాలి**
- **స్పందించిన ఎంపీ ధర్మపురి అరవింద్**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

జిల్లాలో ఉగ్రవాద చర్యలను అరికట్టాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. లా అండ్ ఆర్డర్ సరిగా పనిచేయడం లేదని ఆరోపించారు. తాజాగా మీడియాతో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ పాలనలో సమాజానికి ముప్పు ఉందని విమర్శలు గుప్పించారు. హిందు పండగలపై ఆంక్షలు పెడుతున్నారని.. వినాయక నిమజ్జన వేడుకల్లో హిందూ యువకులపై అక్రమ కేసులు పెట్టారన్నారు. ముస్లిం యువకులు ర్యాలీలు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.. సిమీ పీఎఫ్ ఐ కార్యకలాపాలకు అడ్డగా మారింది.. హిందూ అమ్మాయిలను ప్రేమ పేరుతో లొంగదీసుకుంటున్నారు... ఇది లవ్ జిహాదీ అని తెలిపారు. మార్వాడీ గో బ్యాక్ అంటున్న కాంగ్రెస్ నేతలు.. టర్కీ, బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి వచ్చిన వారి సంగతేంటి? అని ప్రశ్నించారు. కాగా.. నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని పలు ప్రాంతాల్లో ఢిల్లీకి చెందిన స్పెషల్ సెల్ పోలీసులు ఇటీవల సోదాలు చేపట్టడం కలకలం రేపింది. పట్టణ కేంద్రంగా ఉగ్రవాద కార్యకలాపాలకు సహకరిస్తున్నారనే కారణంతో గతంలో ప్రత్యేక బలగాలు పలువురిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ తరుణంలో బీ ఫార్మసీ చదివే ఓ యువకుడిని గత బుధవారం కస్టడీకి తీసుకోవడం చర్చనీయాంశమైంది. పాకిస్థాన్ ఉగ్రమూకా హ్యాండ్లర్లతో సంబంధాలు కొనసాగిస్తున్న జార్ఖండ్‌కు చెందిన డానీష్‌ను ఢిల్లీ ప్రత్యేక పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. తమతో సంబంధం గల వ్యక్తుల పేర్లను అతడు విచారణలో వెల్లడించాడు. ఆ జాబితాలో బోధన్‌కు చెందిన యువకుడి పేరు బహిర్గతమైంది. మరో ముగ్గురు ఈ ముఠాలో ఉండగా, వీరంతా ఉగ్ర సంస్థల నియంత్రణలో పనిచేస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి.

# నేపాల్ ప్రధానికి మోదీ అభినందనలు

- **నేపాల్ తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సుశీల కార్కీ**
- **దేశ చరిత్రలో తొలి మహిళా ప్రధానిగా నిలిచిన సుశీల**
- **జెన్-జెడ్ యువత నిరసనలతో కుప్పకూలిన ఓలీ ప్రభుత్వం**
- **2026 మార్చి 5న సార్వత్రిక ఎన్నికలు జరపనున్న తాత్కాలిక ప్రభుత్వం**



**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**

హిమాలయ దేశం నేపాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశ తాత్కాలిక ప్రధానిగా సుశీల కార్కీ నిన్న ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో నేపాల్ దేశానికి తొలి మహిళా ప్రధానిగా ఆమె చరిత్ర సృష్టించారు. యువత చేపట్టిన తీవ్ర నిరసనల కారణంగా కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం గత వారం పతనమైన నేపథ్యంలో కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరదించుతూ ఆమె ఈ బాధ్యతలు చేపట్టారు. సుశీల నియామకాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు."నేపాల్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన సుశీల కార్కీకి నా హృదయపూర్వక శుభాకాంక్షలు. నేపాల్ ప్రజల శాంతి, ప్రగతి, శ్రేయస్సుకు భారతదేశం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది" అని ప్రధాని మోదీ సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు.గత కొన్ని నెలలుగా అవినీతికి వ్యతిరేకంగా జెన్‌జెడ్ యువత చేపట్టిన ఆందోళనలు నేపాల్‌ను కుదిపేశాయి. ఓలీ ప్రభుత్వం సోషల్ మీడియాపై నిషేధం విధించి, భావప్రకటనా స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపడంతో ఈ నిరసనలు హింసాత్మకంగా మారాయి. పార్లమెంటు సహా పలు ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలపై దాడులు జరిగాయి. ఈ క్రమంలో సైన్యం రంగంలోకి దిగి శాంతిభద్రతలను అదుపులోకి తీసుకుని, ఓలీని సురక్షిత ప్రాంతానికి తరలించింది. అనంతరం దేశాన్ని నడిపించే నేత కోసం జరిగిన అన్వేషణలో మాజీ ప్రధాన న్యాయమూర్తి అయిన సుశీల కార్కీ పేరు ప్రముఖంగా వినిపించింది. జెన్‌జెడ్ యువత ఆమెకు బహిరంగంగా మద్దతు పలికింది. వినూత్నంగా డిస్కార్డ్ అనే ఆన్‌లైన్ వేదికపై జరిగిన పబ్లిక్ ఓటింగ్ ద్వారా యువ నేతలు ఆమెను తమ నాయకురాలిగా ఎన్నుకున్నారు. సంప్రదాయ రాజకీయ శక్తులతో పాటు యువత ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలిచిన ఆమె, అవినీతి రహిత పాలన అందిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.నేపాల్‌లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడటాన్ని భారత విదేశాంగ శాఖ కూడా స్వాగతించింది. "పొరుగు దేశంగా, ప్రజాస్వామ్య భాగస్వామిగా ఇరు దేశాల ప్రజల శ్రేయస్సు కోసం నేపాల్‌తో కలిసి భారత్ పనిచేస్తూనే ఉంటుంది" అని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దేశంలో శాంతిభద్రతలను పునరుద్ధరించి, సజావుగా ఎన్నికలు నిర్వహించడం సుశీల కార్కీ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. తాత్కాలిక ప్రభుత్వం స్థానంలో కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు 2026 మార్చి 5న సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

# కృష్ణా జలాల్లో హక్కు కోసం కసరత్తు

మొదటిపేజీ తరువాయి



సెంటర్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎంతో పాటు ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సి.ఎస్. వైద్యనాథన్, కేంద్ర జలసంఘం మాజీ ఛైర్మన్ కె.వోహ్రా, ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్,నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, ఇ.ఎన్.సి అంజద్ హుస్సేన్, సీఎంవో సెక్రెటరీ మాణిక్‌రాజ్, ఇరిగేషన్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇంతకాలం కృష్ణా నదీ జలాల్లో జరిగిన అన్యాయానికి అడ్డుకట్ట వేసి, మనకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును దక్కించుకునేలా సమర్థవంతమైన వాదనలు వినిపించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి న్యాయ నిపుణులకు పలు సూచనలు చేశారు. అందుకు అవసరమైన సాక్ష్యాధారాలన్నీ ట్రిబ్యునల్ కు సమర్పించాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకు కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులు, నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టులు, అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు, నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రిబ్యునల్ ముందు ఉంచాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన జీవోలు, మెమోలు, డాక్యుమెంటన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, అప్పటి నుంచి ఇప్పటివరకు ఉన్న ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రిబ్యునల్కు అందించాలని చెప్పారు. గత ప్రభుత్వం కృష్ణా జలాల్లో రావాల్సిన నీటి వాటాలను సాధించకపోగా ఏపీకీ 512 టీఎంసీలు కట్టబెట్టి, 299 టీఎంసీల వాటాకు ఒప్పుకొని తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 299 టీఎంసీల వాటాకు ఒప్పుకున్న విషయాన్ని ఏపీ ఇప్పుడు ట్రిబ్యునల్ ముందుకు తెచ్చిందని న్యాయ నిపుణులు సీఎంకు వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోకపోవటంతో వ్యవహరించటంతో ఈ పరిస్థితి వచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. గడిచిన పదేండ్లలో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా జలాల్లో న్యాయపరంగా రావాల్సిన నీటి కోటా సాధించటంలో దారుణంగా విఫలమైందన్నారు. కృష్ణాపై తలపెట్టిన పాలమూరు నుంచి డిండి వరకు ప్రాజెక్టులన్నింటినీ పెండింగ్లో పెట్టిందన్నారు. నీటి వాటాల విషయంలో తీరని ద్రోహం చేసిందన్నారు. దిగువ రాష్ట్రాల హక్కులతో పాటు నదీ వాటాల పంపిణీ న్యాయ సూత్రాల ప్రకారం కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రానికి కృష్ణాలో 904 టీఎంసీల నీటి వాటా రావాల్సి ఉందని, అందుకు అనుగుణంగా వాదనలు సిద్ధం చేయాలని సీఎం స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉదాసీనంగా వ్యవహరించటంతో ఏపీ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలించుకుపోయిందని, ఆ విషయాన్ని ట్రిబ్యునల్ ముందుకు తీసుకురావాలని సీఎం చెప్పారు. శ్రీశైలం రిజర్వాయర్ నిండకముందే, పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా రోజుకు పది టీఎంసీల నీటిని ఏపీ మళ్లిస్తుందని, ఇతర బేసిన్లకు తరలించుకుపోతోందని అన్నారు. ఎక్కడపడితే అక్కడ కాల్వల సామర్థ్యం పెంచుకోవటంతో పాటు పట్టిసీమ, పులిచింతల, చింతలపాడు వరకు ఏపీ అక్రమంగా నీటిని తరలిస్తున్న అంశాలన్నీ ఆధారాలతో సహా ట్రిబ్యునల్కు నివేదించాలని, అందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. కృష్ణా నీటిని ఏపీ అక్రమంగా మళ్లించటంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ తో పాటు పులిచింతల వద్ద ఉన్న జల విద్యుత్తు ప్రాజెక్టులు మూత పడే ప్రమాదం ముంచుకు వచ్చిందన్నారు. తక్కువ ఖర్చుతో ఉత్పత్తయ్యే జల విద్యుత్తు ఉత్పత్తికి విఘాతం కలుగుతోందన్నారు. ఈ విషయాలన్నీ ట్రిబ్యునల్ ఎదుట వాదనలుగా వినిపించాలని సీఎం ఆదేశించారు. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రం కావటంతో తెలంగాణకు రావాల్సిన హక్కులు, నీటి వాటాలను సాధించుకునేందుకు అన్ని అర్హతలున్నాయని సీఎం అన్నారు. సాగునీటి, తాగునీటి అవసరాలతో పాటు మెట్ట ప్రాంతం, కరువు ప్రాంతమైన ఉమ్మడి మహబూబ్నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు కృష్ణా జలాలు తప్ప గత్యంతరం లేదనే విషయాన్ని ట్రిబ్యునల్ దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఇప్పటి వరకు తెలంగాణా ప్రాంతంలో తలపెట్టిన ప్రాజెక్టులు పూర్తి చేయక పోవడం వల్లనే కృష్ణా జలాశయాలను తెలంగాణా వినియోగించుకోలేకపోయిందని గుర్తు చేయాలన్నారు. తెలంగాణ తరపున వాదనలను వినిపించేందుకు ఇదే సరైన అవకాశమని సీఎం అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంతో పాటు, కృష్ణా నదీ జలాల్లో రావాల్సిన వాటాల భవిష్యత్తును దిశానిర్దేశం చేసే వాదనలు కావటంతో ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లో జారవిడుచుకోవద్దని సీఎం న్యాయ నిపుణులకు సూచించారు.

# 'ఊరికే ఎక్కువ చెబితే వాయిదా వేస్తా'

మొదటిపేజీ తరువాయి

రాజీ కుదిర్చిన విషయం తెలిసిందే. కెనడాలో నివసిస్తున్న కాకినాడ వాసి ఉడా మధుసూదనరావుపై ఆయన భార్య 2022లో వరకట్నం కేసు పెట్టారు. ఈ కేసులో ఆయనపై లుక్ అవుట్ నోటీసు జారీ అయింది. 2024 ఫిబ్రవరిలో భారత్‌కు వచ్చినప్పుడు ఆయన్ను అరెస్ట్ చేయగా, తర్వాత బెయిల్ లభించింది. అయితే, ఈ సందర్భంగా అధికారులు ఆయన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకున్నారు. పాస్‌పోర్టు తిరిగి ఇవ్వాలని ఆయన ఏపీ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ ఊరట లభించలేదు. దీంతో ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఈ కేసును సుప్రీంకోర్టు మొదట మధ్యవర్తిత్వానికి పంపింది. అక్కడ, కుమారుడి అవసరాల కోసం భర్త రూ.45 లక్షలు చెల్లించే ఒప్పందంపై పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకోవడానికి ఇద్దరూ ఒప్పుకున్నారు. ఈ ఒప్పందంపై స్పష్టత కోసం శుక్రవారం నాటి విచారణలో జస్టిస్ భట్టి ఇద్దరితో తెలుగులో మాట్లాడారు. "మీరు ఏం చేస్తారు? సెటిల్మెంట్ మొత్తం ఇచ్చేశారా?" అని మధుసూదనరావును ప్రశ్నించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్న భార్యను ఉద్దేశించి, "మీరు రూ.45 లక్షలు తీసుకుని, మళ్లీ కెనడా వెళ్లి అక్కడ బాబు ప్రయోజనాల కోసం మళ్లీ డబ్బులు అడిగితే ఎలా అని మీ భర్త అడుగుతున్నారు. మీ అభిప్రాయం ఏంటి?" అని అడిగారు. దీనికి ఆమె, తన కొడుక్కి 18 ఏళ్లు వచ్చేవరకూ తాను అలాంటిదేమీ చేయనని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మధుసూదనరావు జోక్యం చేసుకుంటూ తాను డిపాజిట్ చేసిన మొత్తం, దానిపై వడ్డీ గురించి చెప్పబోగా, జస్టిస్ భట్టి కలుగజేసుకున్నారు. "మీరు ఇవ్వలేదని నేను చదివాను. ఊరికే ఎక్కువ చెబితే విచారణ వాయిదా వేస్తా.. అర్థమైందా?" అని గట్టిగా హెచ్చరించారు. "కెనడాలో కేసులు యాంత్రికంగా ఉంటాయి, కానీ ఇండియాలో మేం మనసు పెట్టి నిర్ణయిస్తాం. బిడ్డను ఎలా చూసుకోవాలో భారతీయ అమ్మలకు తెలిసినట్లుగా మరెవరికీ తెలియదు" అని వ్యాఖ్యానించారు. సెటిల్మెంట్‌కు భార్య సంసిద్ధత తెలపడంతో ధర్మాసనం వారిద్దరికీ విడాకులు మంజూరు చేసింది. భర్త డిపాజిట్ చేసిన రూ.45 లక్షలను తల్లి, కుమారుడి జాయింట్ అకౌంట్‌లో జమ చేయాలని, ఆ మొత్తాన్ని బాలుడి అవసరాలకే వాడాలని ఆదేశించింది. మధుసూదనరావు పాస్‌పోర్టును తిరిగి ఇవ్వాలని, ఆయనపై ఉన్న లుక్ అవుట్ నోటీసును ఉపసంహరించుకోవాలని అధికారులను ఆదేశించింది. విడాకుల ఉత్తర్వులు ఇవ్వడం తమకు బాధ కలిగిస్తుందని, ఇద్దరూ కలిసి ఉంటే సంతోషించేవాళ్లమని ఈ సందర్భంగా న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు.

# బీసీసీఐ బాస్ రేసులో హర్భజన్ సింగ్

- **భజ్జీ పేరును ప్రతిపాదించిన పంజాబ్ క్రికెట్ అసోసియేషన్**
- **ప్రస్తుతం ఆమ్ ఆద్మీ పార్టీ తరపున రాజ్యసభ సభ్యుడిగా హర్భజన్**
- **ఈ నెల 28న బీసీసీఐ అధ్యక్ష పదవికి ఎన్నికలు**
- **ఇటీవల వినిపించిన సచిన్ పేరు.. ఖండించిన ఆయన టీమ్**
- **నామినేషన్ల ప్రక్రియపై త్వరలో స్పష్టత**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**



భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) అధ్యక్ష పదవికి జరగనున్న ఎన్నికల బరిలో టీమిండియా మాజీ స్పిన్ దిగ్గజం హర్భజన్ సింగ్ పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. ఈ అత్యున్నత పదవి కోసం పంజాబ్ క్రికెట్ అసోసియేషన్ (పీసీఏ) 45 ఏళ్ల హర్భజన్ పేరును ప్రతిపాదించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే, నామినేషన్లకు సంబంధించి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. నిబంధనల ప్రకారం, ఏదైనా రాష్ట్ర క్రికెట్ సంఘం మద్దతు ఉన్న అభ్యర్థులు మాత్రమే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులు. భారత్ తరఫున 367 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన హర్భజన్, అన్ని ఫార్మాట్లలో కలిపి 700కు పైగా వికెట్లు పడగొట్టాడు. క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత ఆయన ప్రజా జీవితంలోనూ చురుగ్గా ఉంటున్నారు. 2022లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తరఫున రాజ్యసభకు నామినేట్ అయ్యారు. ఇప్పుడు బీసీసీఐ అధ్యక్ష పదవి రేసులో ఆయన పేరు వినిపించడం ప్రాధాన్యం సంతరించుకుంది. బీసీసీఐ ఎన్నికల ప్రక్రియ ఈ నెలాఖరులో ప్రారంభం కానుంది. ఎన్నికల అధికారి ఏకే జోతి విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 20, 21 తేదీల్లో నామినేషన్లను స్వీకరిస్తారు. 22న నామినేషన్ల పరిశీలన, 23న ఉపసంహరణకు గడువు ఉంటుంది. అదే రోజున తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. అవసరమైతే సెప్టెంబర్ 28న పోలింగ్, ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. అధ్యక్ష పదవితో పాటు ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి పదవులకు కూడా ఎన్నికలు జరగనున్నాయి. కార్యదర్శిగా దేవాజిత్ సైకియా, కోశాధికారిగా ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా, సంయుక్త కార్యదర్శిగా రోహన్ దేశాయ్ ఏకగ్రీవంగా తిరిగి ఎన్నికయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇటీవలే సచిన్ టెండూల్కర్ పేరు కూడా అధ్యక్ష పదవికి వినిపించినప్పటికీ, ఆ వార్తలను ఆయన ప్రతినిధులు ఖండించారు. ఈ నేపథ్యంలో హర్భజన్ సింగ్ నిజంగానే బరిలో ఉంటాడా? లేదా? అనే విషయంపై త్వరలోనే స్పష్టత రానుంది.

# రూ.500 కోట్ల భూమి సేఫ్

- **శంషాబాద్‌లో 12 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా**
- **భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి, ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

హైడ్రా అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెట్టిస్తోంది. చెరువులు,నాళాలు, ప్రభుత్వ స్థలాలు, బఫర్ జోన్ లోని స్థలాలను కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కబ్జాదారుల నుంచి వందల కోట్ల విలువైన భూములను రక్షిస్తుంది హైడ్రా. ఈ క్రమంలో శంషాబాద్ లో 12 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన నిర్మాణాలతో పాటు ప్రహరీ గోడను తొలగించింది. 12 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ వేసి, ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు చేసింది. ఈ ప్రభుత్వ భూమి విలువ రూ. 500 కోట్లు ఉంటుందని తెల్చింది. 2011లో ఈ 12 ఎకరాల భూమిని ఇంటర్మీడియట్ బోర్డుకు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం.. కాగా, ఈ భూమి తనదే అంటూ అనీష్ కన్స్ట్రక్షన్ బోర్డు ఏర్పాటు చేసి నిర్మాణాలు చేపట్టింది.. స్థానికుల సమాచారంతో హైడ్రాకు ఫిర్యాదు చేసిన ఇంటర్మీడియట్ బోర్డు.. రెవిన్యూ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించిన హైడ్రా.. ప్రభుత్వ భూమిగా నిర్ధారించి, కబ్జా నుండి కాపాడింది.



# నిండుకుండలా జంట జలాశయాలు

మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం 1762.80 అడుగులకు చేరిన నీటిమట్టం..6 గేట్లు 5 అడుగుల మేర తెరిచి 3072 క్యూసెక్కుల నీటిని ఉస్మాన్ సాగర్ నుంచి విడుదల చేశారు అధికారులు.. 4 గేట్లు 4 అడుగుల మేర తెరిచి 5215 క్యూసెక్కుల నీటిని మూసి లోకి విడుదల చేశారు. జంట జలాశయాల నుంచి 8 వేల క్యూసెక్కుల నీటిని మూసి లోకి విడుదల చేశారు. జంట జలాశయాలనుంచి వస్తున్న వరద తాకిడికి ఉధృతంగా ప్రవహిస్తున్న మూసి.. మూసి ప్రవాహంతో పరిసర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు.. మూసి ప్రవాహానికి మూసారాంబాగ్ బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న వరద.. నిన్న సాయంత్రం నుండి బ్రిడ్జిపై నుంచి రాకపోకలు నిలిపివేసిన అధికారులు.. ముసారంబాగ్ మూసివేతతో గోల్నాక బ్రిడ్జిపై పెరిగిన ట్రాఫిక్ రద్దీ.. మూసి పరివాహక ప్రాంతమైన జియాగూడ 100 ఫీట్ రోడ్డుపై కూడా వరద ప్రవహిస్తోంది.. వరద ప్రవాహానికి జియాగూడ 100 ఫీట్ రోడ్డుపై రాకపోకల నిలిపివేశారు. పురాణ పూల్ వద్ద కూడా మూసి ఉధృతంగా ప్రవహిస్తోంది.

# ఉప ఎన్నికలు రావడం ఖాయం

మొదటిపేజీ తరువాయి

నిజంగా మగాడైతే ఆ పది మంది ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించాలి. అప్పుడు ఎన్నికల్లో ప్రజలు ఎవరి పనితీరు బాగుందో నిర్ణయిస్తారు" అని అన్నారు. గతంలో ఎమ్మెల్యేలు పార్టీ మారితే రాళ్లతో కొట్టాలని చెప్పిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఆ మాటను ఎందుకు గుర్తుచేసుకోవడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. "అవసరమైతే రైలు కింద తలపెడతా కానీ కాంగ్రెస్‌లో చేరను అని చెప్పిన వ్యక్తి ఆయనే. ఇప్పుడు నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారాను అంటున్నారు. అది నిజంగా నియోజకవర్గ అభివృద్ధి కోసమా లేక ఆయన సొంత అభివృద్ధి కోసమా?" అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ పలు సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో 563 గ్రూప్1 ఉద్యోగాలను ఒక్కొక్కటి రూ. 3 కోట్ల చొప్పున అమ్ముకున్నారని, దీని ద్వారా దాదాపు రూ.1,700 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. రైతులకు అందాల్సిన యూరియాను కాంగ్రెస్ నాయకులు బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని...రైతులు ఎండలో, వానలో యూరియా కోసం పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆయన మండిపడ్డారు.



## ఉత్తమ సేవ చేసిన వారికే
# మంచి గుర్తింపు

### అవార్డు గ్రహీతకు మంథని మాజీ ఎమ్మెల్యే సన్మానం

**మంథని/పెద్దపల్లి,సెప్టెంబర్13(ప్రజా స్వరం):**

విద్యార్థులకు మంచి విద్యాబోధన అందిస్తూ వారిని ఉత్తములుగా తీర్చిదిద్దడంలో సేవలు అందించే వారికే మంచి గుర్తింపు లభిస్తుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు.ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై అవార్డు అందుకున్న మంథనికి చెందిన గీట్ల భరత్‌రెడ్డిని శనివారం మంథనిలోని ఆయన నివాసంలో కలిసి శాలువా పూలమాలలతో సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం మంథనికే గర్వకారణమన్నారు.అంకితభావంతో పని చేస్తూ విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని ఆయన ఆకాంక్షించారు.ఆయన వెంట పలువురు ఉన్నారు.



## ఎంపీ చిత్రపటానికి పాలాభిషేకం

**మెదక్, సెప్టెంబర్ 13 (ప్రజా స్వరం) :**

సెంట్రల్ సోలార్ లైట్లను ఏర్పాటు చేసినందుకు నిజాంపేట మండలం నందిగామ గ్రామంలో బిజెపి నాయకులు ఎంపీ రఘునందన్ రావు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఎంపీ నిధులతో సెంట్రల్ సోలార్ లైట్లను అమర్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ఆకుల రమేష్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాలం నాగరాజ్, బాజా దేవేందర్, కిషన్ నాయక్, మహేష్ మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

## మీ సేవ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

### రాష్ట్ర అధ్యక్షుడు జీవన్ ప్రసాద్

**శామీర్ పేట సెప్టెంబర్ 13(ప్రజాస్వరం):**

శామీర్ పేట్ మండల పరిధిలోని ఓ హోటల్ లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు జీవన్ ప్రసాద్ మాట్లాడుతూ 2017లో మాత్రమే చివరిసారిగా మీసేవ కమిషన్ పెంపు జరిగిందని గుర్తు చేశారు. ప్రతిరోజు 8 నుండి 12 గంటల వరకూ శ్రమిస్తూ ఆపరేటర్లు ప్రభుత్వ సేవలను నేరుగా ప్రజలకు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, కోశాధికారి శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ అశ్విన్ గౌడ్, జగదీశ్వర్, లక్ష్మీనారాయణ, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు సాగర్ బాబు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్, శివకుమార్, పలు జిల్లాల మీసేవ ఆపరేటర్లు పాల్గొన్నారు.




## జాతీయ సాహిత్య పురస్కారానికి
# దేవులపల్లి రమేశ్ ఎంపిక

**సిద్దిపేట,సెప్టెంబర్ 13 (ప్రజా స్వరం) :**



సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రానికి చెందిన, మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, తెలుగు అతిథి ఉపాధ్యాయుడు, దేవులపల్లి రమేశ్ కు జాతీయస్థాయిలో శ్రీ శ్రీ కళావేదిక, "సాహితీ కిరీటి" పురస్కారానికి ఎంపిక చేసినట్లు శ్రీ శ్రీ కళావేదిక,మేనేజింగ్ డైరెక్టర్, కత్తిమండ ప్రతాప్ కుమార్, జాతీయ యువజన విభాగం, అధ్యక్షుడు, గరిమెళ్ళ రాజేంద్ర ప్రసాద్,జాతీయ అధ్యక్షురాలు, ఈశ్వరి భూషణం, దేవులపల్లి రమేశ్,తెలుగు సాహిత్యానికి కృషి చేస్తున్నందుకుగాను,ఈ పురస్కారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్ద సాహిత్య సంస్థ, ఐ.ఎస్.ఓ గుర్తింపు పొందిన సాహిత్య సంస్థ, నా సాహిత్య సేవలు, గుర్తించి జాతీయ స్థాయిలో సాహితీ కిరీటీ పురస్కారం రావడం చాలా సంతోషమన్నారు. ఈ నెల 28 ఆదివారం హైదరాబాద్ బిర్లా ఆడిటోరియంలో జరిగే సాహితీ పట్టాభిషేక మహోత్సవంలో పురస్కారం ప్రదానం చేయునట్లు కవి, రచయిత దేవులపల్లి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా రచయిత రమేశ్ ను సాహితీ వేత్తలు పలువురు అభినందించారు.

# తైబజార్ రద్దుపై రైతుల హర్షం

### ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చిత్రపటానికి పాలాభిషేకం



**మెదక్, సెప్టెంబర్ 13 (ప్రజా స్వరం) :**

మెదక్, రామాయంపేట మున్సిపాలిటీల్లో తైబజార్ రద్దు చేయడం సంతోషకరమని బొద్దుల కృష్ణ అన్నారు. తైబజార్ రద్దు నేపథ్యంలో శనివారం మెదక్ పట్టణం మార్కెట్ లో రైతులు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయలు పండించే రైతులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు తైబజార్ రద్దు సంతోషకరమని అన్నారు. రైతులు బాగుండాలనే మంచి లక్ష్యంతో ఎమ్మెల్యే ముందుకు వెళ్తున్నారని ఎలాంటి మరెన్నో మంచి పనులు చేస్తూ ఆయన ముందుకు సాగాలని కోరుతున్నట్లు తెలిపారు. వరద వల్ల ఇబ్బందులు పడుతున్న దుప్ సింగ్ తండా వాసులకు నిత్యసర సరుకులు, కూరగాయలను అందించారని గుర్తు చేశారు. నియోజకవర్గంలోని ప్రజల, రైతుల సమస్యలపై వెంటుండి మరి పరిష్కారం కోసం కృషి చేస్తున్న వ్యక్తి అన్నారు. మెదక్, రామాయంపేట తైబజార్ వసూళ్లు రద్దు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## జీఎస్టీ అవగాహన సదస్సులో
# ప్రోటోకాల్ తప్పిదం లేదు

### బీజేపీ గజ్వేల్ మండల అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్

**గజ్వేల్, (ప్రజాస్వరం) :**

గజ్వేల్ పట్టణంలో నిన్న జరిగిన జీఎస్టీ అవగాహన సదస్సులో ఎటువంటి ప్రోటోకాల్ తప్పిదం లేద గజ్వేల్ మండల బీజేపీ అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలో అయ్యప్ప టెంపుల్ ఫంక్షన్ హాల్ లో జరిగిన జీఎస్టీ వర్తక వాణిజ్య వ్యాపారస్తుల సమావేశం లో ప్రోటోకాల్ తప్పిదం జరిగిందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని వారి తీరును ఖండిస్తున్నామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో సమావేశం జరిగినందున మున్సిపాలిటీ అధ్యక్షుడు వరకు ప్రోటోకాల్ ఉంటుందన్నారు. కాశమైన నవీన్ అలియాస్ ఢిల్లీ అనే వ్యక్తి ఫంక్షన్ హాల్ దగ్గరికి వచ్చి అలజడి సృష్టించి అక్కడ ఏర్పాటు చేసిన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ గారి ఫ్లెక్సీలను చించడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భారతీయ జనతా పార్టీలో ఒక క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలు ఉంటారు కానీ ఇలాంటి ఆకతాయి వ్యక్తులు ఉండరన్నారు. బీజేపీ పేరు చెప్పుకొని గజ్వేల్ లో పబ్బం గడుపుకుంటున్న వారిపై తప్పకుండా చర్యలు ఉంటాయని తెలియజేస్తున్నామన్నారు. మేము గత కొన్ని సంవత్సరాలుగా భారతీయ జనతా పార్టీ సైనికులుగా గజ్వేల్ లో పనిచేస్తూ పార్టీ సిద్ధాంతాల కోసం అహర్నిశలు శ్రమిస్తూ గజ్వేల్లో పార్టీని ఈ స్థాయికి తీసుకువచ్చిన మమ్ములను బద్నాం చేస్తూ పార్టీ స్థాయిని దిగజార్చాలని చూస్తున్న కొంతమందిని ఖబర్దార్ అని హెచ్చరిస్తున్నామన్నారు. గజ్వేల్ లో బీజేపీ ఎదుగుదలను ఎవరు ఆపలేరు అని తెలియజేస్తున్నామని అన్నారు.



# రెండేళ్ల కూతురిని చంపిన తల్లి





**తూప్రాన్, సెప్టెంబర్ 13, ప్రజాస్వరం :**

వివాహేతర సంబంధానికి అడ్డు వస్తుందని కన్నా కూతురిని ప్రియుడితో కలిసి చంపిన ఘటనలో తల్లి తో పాటు ప్రియుడిని అరెస్ట్ చేసి శనివారం రిమాండ్ కు తరలించినట్లు తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ తెలిపారు.వివరాలు శబాష పల్లి గ్రామానికి చెందిన కోట్ల రాజు తన కుమార్తె మమత కు ఐదేళ్ల క్రితం వడ్డేపల్లి గ్రామానికి చెందిన బంటు భాస్కర్ కి ఇచ్చి వివాహం చేశారు. వారికి కొడుకు ,కూతురు తనుశ్రీ - 2 సంవత్సరాలు) సంతానం ఉన్నారు. మమత మే నెలలో తన పిల్లలను తీసుకొని తల్లిగారింటికి వెళ్లింది. మే నెల 21వ తారీకు మధ్యాహ్నం అందజా మూడు గంటల సమయంలో మమత కొడుకు చరణ్ ను తల్లిగారి ఇంటి వద్దనే ఉంచి కూతురు తనశ్విని తీసుకొని అత్త గారింటికి వెళుతున్నానని చెప్పి వెళ్ళింది. అల్లుడు భాస్కర్ మమత ఇంకా మా ఇంటికి రాలేదని చెప్పగా కూతురు కు ఫోన్ చేస్తే కలవకపోయేసరికి చుట్టుపక్కల మరియు బంధువుల వద్ద వెతికిన ఎటువంటి ఆచూకీ లభించలేదు. దీంతో మమత తండ్రి శివంపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు లో భాగంగా మమత గుంటూరు జిల్లా నరసరావుపేట మండలం కనపర్రు గ్రామంలో ఉంటున్నదని తెలుసుకొనీ పోలీస్ బృందం అక్కడకు వెళ్ళి మమత తో పాటు ఆమె ప్రియుడు షేక్ ఫయాజ్ పట్టుకొని విచారించగా ఇద్దరు కలిసి సహజీవనం చేస్తున్నట్లు తెలిపారు. ఆమెతోపాటు ఉండాల్సిన కూతురూ ఎక్కడని ప్రశ్నించగా రాత్రి సమయంలో కూతురు తనుశ్రీ ఏడ్చుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తుందని ఆమెను ఎలాగైనా చంపివేస్తేనే వివాహేతర సంబంధానికి అడ్డు తొలగి పోతుందని జూన్ 04 వ తేదీన నాడు రాత్రి సమయంలో కనపర్రు నుండి శభాష్ పల్లికి వచ్చి గ్రామ శివారులోని కొత్త కుంట క్రింద ఎవరు లేని సమయం లో తనుశ్రీ ని వారిద్దరూ కలిసి గొంతు పిసికి చంపివేసి కాలువ కట్టలో పతిపెట్టినట్లు ఒప్పుకున్నారన్నారు.వారి వద్ద నుండి ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.ఈ కేసులో కీలక పాత్ర పోషించిన తూప్రాన్ సిఐ రంగాకృష్ణ, శివంపేట ఎస్సై మధుకర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది మహేందర్, విష్ణువర్ధన్ రెడ్డి, గట్టేష్ లను తూప్రాన్ డిఎస్పి అభినందించారు.



# రాజమార్గమే రాజమార్గం

## జిల్లా వ్యాప్తంగా 4,987 అన్ని రకాల కేసుల పరిష్కారం

## మొత్తం కేసుల్లో 1,04,88,964 రికవరీ

**మెదక్, సెప్టెంబర్ 13 (ప్రజా స్వరం) :**

రాజీయే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. నీలిమ అన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కోర్టు ప్రాంగణంలోని అన్ని కోర్టులలో, నర్సాపూర్, అల్లదుర్గ్ కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం ఏడు బెంచ్ లు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. నీలిమ మాట్లాడుతూ రాజీ పడడంతో ఇరువురికి న్యాయం జరుగుతుందన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్తో జిల్లా వ్యాప్తంగా 4,987 అన్ని రకాల కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. మొత్తం కేసుల్లో 1,04,88,964 రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.ఎం సుభవల్లి, సీనియర్ సివిల్ జడ్జ్ రుబీనా ఫాతిమా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సిరి సౌజన్య, స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ సాయి ప్రభాకర్, మార్నింగ్ కోర్ట్ జడ్జెస్ సిద్దయ్య, స్వాతి, బార్ ప్రెసిడెంట్ ఎం. రాములు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ లు, న్యాయవాదులు, అన్ని కోర్టుల సిబ్బంది, పోలీసులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్ ద్వారా 927 కేసులు పరిష్కారం



## ఎస్పీ నారాయణ రెడ్డి

**వికారాబాద్, సెప్టెంబర్ 13(ప్రజా స్వరం):**

వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో పోలీస్ శాఖ కు సంబంధించిన మొత్తం 927 కేసులు పరిష్కరించబడ్డాయని జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి తెలిపారు. కేసుల సత్వర పరిష్కారం కోసం ఈ లోక్ అదాలత్ ఒక మంచి అవకాశం కల్పించిందని ఆయన పేర్కొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ లో పోలీస్ శాఖ యొక్క పరిష్కరించబడిన కేసుల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి.

ఎఫ్ఐఆర్ కేసులు: మొత్తం 280 కేసులకు పరిష్కారం చూపబడింది. ఇందులో యు ఐ క్రింద 33 కేసులు, PT క్రింద 225 కేసులు ఉన్నాయి.

ఈ-పెట్టి కేసులు: 2 ఈ-పెట్టి కేసులు పరిష్కారమయ్యాయి.

మోటార్ వెహికల్ యాక్ట్ కేసులు: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు మొత్తం 645 కేసులు పరిష్కరించబడ్డాయి.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు తమ కేసులను త్వరగా పరిష్కరించుకోవడానికి ఇలాంటి లోక్ అదాలత్ లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేసుల పరిష్కారానికి సహకరించిన జిల్లా జడ్జ్ అధికారులకు, న్యాయవాదులకు, పోలీసు సిబ్బందికి, మరియు ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# అప్రమత్తంగా ఉండాలి

వైద్యాధికారులు, సిబ్బంది బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవు

రానున్న 48 గంటల్లో జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం

మంజీరా నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





**మెదక్ సెప్టెంబర్ 13 (ప్రజా స్వరం) :**

జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యాధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విధుల యందు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు. శనివారం కౌడిపల్లి మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారుల సిబ్బంది హాజరు పట్టికను, ఓపి రిజిస్టర్, మందుల నిల్వ ల గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారులు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని బాధ్యత రాహిత్యంగా విధులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రానున్న 48 గంటల్లో వాతావరణ శాఖ హెచ్చరిక మేరకు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించిన మేరకు స్వీయ రక్షణ పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంజీర నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని దూర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని,సూచించారు. గడిచిన 15 రోజుల నుంచి అడపాదడప భారీ వర్షాలు కురుస్తున్నాయని లో లైన్ కాజు వేలు కల్వర్టులు, వరద ప్రవాహం ఉన్న వాటిని ప్రజలు దాటేయత్నం చేయొద్దని, దురదృష్టవశాత్తు ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హితవు పలికారు. ఉరుములు మెరుపులు వచ్చి పిడుగులు పడే అవకాశం ఉన్నప్పుడు చెట్ల కింద ఉండకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. వర్షాలు పెద్ద ఎత్తున ఉన్నాయి కాబట్టి ప్రజలకు సీజనల్ వ్యాధులు చికెన్ గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతకమైన వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున ప్రజలందరూ వ్యక్తిగత శారీరక పరిసరాల పరిశుభ్రత పై దృష్టి సారిస్తూ నీరు నిలవకుండా చూసుకుంటూ స్వీయ రక్షణ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# గ్రూప్–2 ఫలితాలు వెల్లడించి ఆరు నెలలు అవుతుంది

## అపాయింట్మెంట్ పత్రాలు ఇవ్వాలని మంత్రి శ్రీధర్ బాబుకు వినతిపత్రం

**పెద్దపల్లి,సెప్టెంబర్13(ప్రజా స్వరం) :**

గ్రూప్-2 ఫలితాలు వెల్లడించి ఆరు నెలలు కావస్తున్నాయని వెంటనే సర్వీసెస్ నీ కేటాయించి అపాయింట్మెంట్ పత్రాలు అందజేయాలని గ్రూప్ 2 సాధించిన అభ్యర్థులు రాష్ట్ర యువజన నాయకుడు గోమాస సచిన్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ లో రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు,శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును కోరారు.మంత్రి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించి అతి త్వరలో అపాయింట్మెంట్ పత్రాలను ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందిస్తామని హామీ ఇచ్చారని గ్రూప్ 2 అభ్యర్థులు తెలిపారు.అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు ధన్యవాదాలు తెలిపారు.



# శాంతి సామరస్యత నెలకొల్పేందుకు వివాదాలు ఉండొద్దు

## న్యాయ సేవ లోక్ అదాలత్ ల ద్వారా ఇరుపక్షాలకు సమన్యాయం

## జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జ్ సున్నం శ్రీనివాస్ రెడ్డి

**వికారాబాద్, సెప్టెంబర్ 13(ప్రజా స్వరం):**

వికారాబాద్ జిల్లా కోర్టులో శని వారం జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జ్ సున్నం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన లోక్ అదాలత్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రిన్సిపల్ జడ్జి సున్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ చిన్న చిన్న వివాదాలకు సంబంధించిన కేసులను అదాలత్ ప్రత్యేక న్యాయ పరిష్కార సదస్సు లో పరిష్కరించుకోవచ్చని సూచించారు. సమాజంలో శాంతి, సామరస్యం నెలకొనేందుకు పరిష్కరించదగిన కేసులను న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లోక్ అదాలత్ న్యాయ సదస్సులు ఇరుపక్షాలకు సమన్యాయం అందిస్తాయని అన్నారు. భూ తగాదాలకు సంబంధించిన సివిల్ కేసులు, చిన్న చిన్న క్రిమినల్ కేసులను లోక్ అదాలత్ న్యాయ సదస్సులో ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చని సూచించారు. లోక్ అదాలత్ లో పరిష్కరించిన కేసులు పైకోర్టుకు అప్పీలు చేయకుండా రాజీ చేయవచ్చని తెలిపారు. చిన్న చిన్న కేసులను లోక్ అదాలత్ లో పరిష్కరించడం ద్వారా పోలీసులకు న్యాయాధికారులకు కేసుల ఒత్తిడి కూడా తగ్గుతుందని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. బాధితులకు కక్షిదారులకు కూడా సమన్యాయం లభిస్తుందని తెలిపారు.

**తాండూరు కోర్టులో....**

తాండూరు సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో 70 కేసులకు పరిష్కారం లభించింది. మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి శివలీల, అడిషనల్ జడ్జీ అంబటి ప్రణయల ఆధ్వర్యంలో ఈ కేసులను పరిష్కరించారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా తాండూరు నియోజకవర్గంలోని కక్షిదారులు న్యాయస్థానంకు వచ్చారు. న్యాయమూర్తి కక్షిదారులతో మాట్లాడి కేసులలో రాజీకి అంగీకరించడంతో కేసులను పరిష్కరించారు. ఇందులో సీసీ ఎక్సైజ్ కేసులు 16, సీసీ కేసులు 21, ఎన్ఐ సీసీ కేసులు 2, ఓఎస్ కేసులు 2, క్రైమ్ కేసులు 15, ఇతర కేసుల 14 మొత్తం 70 కేసులు పరిష్కారం అయినట్లు కోర్టు ప్రతినిధులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పీపీ అన్వేష్ సింగ్. లోక్ అదాలత్ మెంబర్స్ మనోహర్ రావు, చంద్రశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులు పినమోని శ్రీనివాస్, చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయ అధికారులు పాల్గొన్నారు.





# రాజీమార్గమే రాజమార్గం

**మంథని/పెద్దపల్లి,సెప్టెంబర్13(ప్రజా స్వరం):**

సుప్రీంకోర్టు ఆదేశానుసారం లోక్ ఆదాలత్ లతో కక్షిదారులకు రాజీమార్గమని,రాజీ చేసుకోవడం ఇరువురు గెలుపుకు నాంది పలుకుతుందని పెద్దపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునిత కుంచాల అన్నారు. శనివారం మంథని పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జీ కోర్టులో లోక్ అదాలత్ కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు.లోక్ అదాలత్ లో కక్షిదారులు ఇరువురు స్నేహపూర్వ వాతావరణముతో కలుసుకొని,కోపాలు ,భావోద్వేగాలు లేకుండా,డబ్బులు,సమయం వృధా కాకుండా వారి సమస్యలను పరిష్కరించుకోవడం ఇరువురికి సంతోషకరణమని,కక్షి దారులు రాజీ మార్గంలో వచ్చినట్లయితే,ఒక ప్రక్క కోర్టుకు,మరొక ప్రక్క సమయం కూడా వృధా కాదని,ఇతర అత్యవసర కేసులో పరిష్కరించుటకు సమయం దొరుకుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కక్షి దారులకు,ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ లోక్ అదాలత్ లో మంథని కోర్టులో 271 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియరు సివిల్ జడ్జి వి.భవాని,అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జీ ఎ.సుదారాణి,ద్వితీయ శ్రేణి న్యాయాదికారిణి అనురాధ,రెవెన్యూ డివిజనల్ అధికారి బి.సురేష్,గోదావరిఖని ఏసిపి మడత రమేష్,అసోసియేషన్ అధ్యక్షుడు హరి బాబు,తహసీల్దార్ కుమార స్వామి పాల్గొన్నారు.



# మూసీ ఉగ్రరూపం.

**హైదరాబాద్‌లో ముసారాంబాగ్ బ్రిడ్జిపై రాకపోకల బంద్**

**హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ గేట్ల ఎత్తివేతతో పెరిగిన ప్రవాహం**

**గోల్నాక బ్రిడ్జిపై భారీగా పెరిగిన ట్రాఫిక్ రద్దీ**

**నార్సింగ్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు కూడా మూసివేత**

**హైదరాబాద్, ప్రజాస్వరం :**

హైదరాబాద్‌లోని జంట జలాశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ గేట్లను ఎత్తివేయడంతో మూసీ నదికి వరద పోటెత్తింది. ప్రవాహ ఉద్ధృతి పెరిగి ప్రమాదకర స్థాయికి చేరడంతో అధికారులు కీలకమైన ముసారాంబాగ్ బ్రిడ్జిని మూసివేశారు. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిన్న మధ్యాహ్నం 2 గంటల నుంచే ముసారాంబాగ్ బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహించడం మొదలైంది. దీంతో అప్రమత్తమైన మలక్ పేట ట్రాఫిక్ పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. బ్రిడ్జికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ముసారాంబాగ్ మార్గాన్ని మూసివేయడంతో వాహనాలను గోల్నాక బ్రిడ్జి వైపు మళ్లించారు. ఫలితంగా గోల్నాక మార్గంలో వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరిగిపోయి, ట్రాఫిక్ నెమ్మదిగా కదిలింది. గత రాత్రి 7 గంటల సమయంలో అధికారులు జంట జలాశయాల గేట్లను మరింతగా ఎత్తివేశారు. ఉస్మాన్‌సాగర్ (గండిపేట) ఐదు గేట్లను నాలుగు అడుగుల మేర ఎత్తి 3 వేల క్యూసెక్కుల నీటిని, హిమాయత్‌సాగర్ నాలుగు గేట్లను నాలుగు అడుగుల మేర ఎత్తి 5 వేల క్యూసెక్కుల నీటిని మూసీ నదిలోకి విడుదల చేశారు. ఈ భారీ ప్రవాహం కారణంగా నార్సింగ్ ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డుతో పాటు హిమాయత్‌నగర్‌లోని సర్వీస్ రోడ్డును కూడా మూసివేశారు. దీంతో నార్సింగ్, మంచిరేవుల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

# విద్యార్థులకు విద్య, నాణ్యమైన మంచి పౌష్టికాహారం అందించాలి



**అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్..**

**వనపర్తి, సెప్టెంబర్ 13 (ప్రజాస్వరం):**

విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్యను అందించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ఖీమ్యా నాయక్ ఆదేశించారు. శనివారం వనపర్తి మండలం, పెద్దగూడెంలోని మహాత్మా జ్యోతిబాపూలే వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలను అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ప్రిన్సిపాల్, సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. వంట గది, నిల్వ గది పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. వంట గదిని, నిల్వ గదిని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. వంట చేసేవారు వంటకు ముందు చేతులను శుభ్రంగా కడుక్కొని వంటలు ప్రారంభించాలన్నారు. వంట సిబ్బందికి వైదల్ పరీక్షలు చేయించారా లేదా అని విచారించారు. కూరగాయలు, వంట నూనె నాణ్యత, బియ్యం సన్న రకమా కాదా అని స్వయంగా పరిశీలించారు. తాగునీటి సౌకర్యాలను తనిఖీ చేశారు. అనంతరం, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. డి.సి.ఓ శ్రీవేణి, తహసీల్దార్ రమేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రశాంతి, ఫుడ్ సూపర్వైజర్ స్టెల్లా తదితరులు అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు.



# చంద్రంపాలెం లో టౌన్ ప్లానింగ్ అధికారుల సహాయ, సహకారాలతో అక్రమ నిర్మాణాలు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 13(ప్రజాస్వరం):**

జీవీఎంసీ జోన్ 2 పరిధిలోని చంద్రంపాలెం ప్రాంతంలో అక్రమ నిర్మాణాల పర్వం జోరుగా సాగుతోంది. స్థానిక రఘు తేజ, టీపీవో శ్రీ లక్ష్మి, ఏసీపీ శాస్త్రిల అధికార పరిధిలో పక్కపక్కనే నిర్మిస్తున్న రెండు గ్రూప్ హౌస్లలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలుసమాచారం ప్రకారం, ఈ రెండు భవన నిర్మాణాల్లో 'జీరో సెట్బ్యాక్' (నిర్మాణం చుట్టూ ఖాళీ స్థలం వదలకుండా) మరియు అదనపు అంతస్తుల నిర్మాణాలు చేపట్టారు. దీనివల్ల జీవీఎంసీకి లక్షలాది రూపాయల ఆదాయం కోల్పోగా, బిల్డర్లు మాత్రం భారీగా లాభాలు పొందుతున్నారు. ఈ రెండు భవనాల్లో ఒకటి ఇప్పటికే వైట్వాష్ కూడా పూర్తి చేసుకుంది, మరొకటి ఇంకా నిర్మాణ దశలో ఉంది. అధికారుల నిర్లక్ష్యంపై అనుమానాలుఈ అక్రమ నిర్మాణాలపై ఇంతవరకు టౌన్ ప్లానింగ్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఒక దళారీ వ్యవస్థ నడుస్తోందని, దళారులు అక్రమ భవనాలను ఒప్పుకుని, అధికారులను ప్రసన్నం చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దళారులు, అధికారుల మధ్య ఉన్న అవగాహన కారణంగానే అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. జీవీఎంసీ జోన్ 2 పరిధిలో అక్రమ నిర్మాణాల పర్వం టౌన్




ప్లానింగ్ అధికారులపై తీవ్ర ఆరోపణలు ''ఎ' అనే బిల్డర్ 'బి' అనే అధికారికి 'ప్రతిఫలం ఇస్తే, 'బి' అనే అధికారి 'ఎ' అనే బిల్డరు బహుమతి ఇస్తున్నట్లుగా ఈ అక్రమాలు సాగు తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ కట్టడాలపై ఉన్నతాది కారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేకపోతే నగరంలో ఇలాంటి అక్రమ కట్టడాలు మరింత పెరిగి, ప్రభుత్వ ఆదాయానికి గండిపడటంతో పాటు భవిష్యత్తులో ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఉత్తరాంధ్రకు ఆయువుపట్టు భోగాపురం విమానాశ్రయం..

**జూన్ 2026కు నిర్మాణం పూర్తి.**

**కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు,**

**భోగాపురం, సెప్టెంబర్ 13(ప్రజాస్వరం):**

భోగాపురంలో నిర్మాణ దశలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయ పనులను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం నాడు పరిశీలించారు. భోగాపురం చేరుకున్న రామ్మోహన్ నాయుడుకు జి.ఎం.ఆర్ అధికారులు క్షేత్ర స్థాయిలో జరుగుతున్న నిర్మాణ పనుల వివరాలను తెలియపరిచారు. ఈ సందర్భంగా విమానాశ్రయాన్ని అంతటినీ కలియ తిరిగి పనులన్నీ సక్రమంగా సాగుతున్నాయి అన్న సంతృప్తిని రామ్మోహన్ నాయుడు వ్యక్తపరిచారు. అనంతరం నిర్మాణం దశను పూర్తి చేసుకున్న రన్ వే ను సైతం పరిశీలించారు. ముందుగా నిర్ణయించుకున్న డి.పి.ఆర్ మేరకు నిర్మాణాలు సక్రమంగా జరుగుతున్నాయని, దేశంలోనే మిన్నగా భోగాపురం ఎయిర్ పోర్ట్ నిలుస్తుంది అన్న ఆశాభావాన్ని రామ్మోహన్ నాయుడు వ్యక్తం చేశారు. తర్వాత విమానాశ్రయ నిర్మాణ పనులు చేపడుతున్న జిఎంఆర్ అధికారులతో సమీక్ష సమావేశంలో రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా పనులు ఎక్కడ వరకు జరుగుతున్నాయి.. ఏ దశలో ఉన్నాయి.. అన్న విషయాలను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు జిఎంఆర్ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా తనకున్న సందేహాలను సైతం సమీక్షలో చెప్పి వాటి నుంచి వివరణ తీసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రామ్మోహన్ నాయుడు జూన్ 2026 నాటికల్లా విమానాశ్రయ నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమవుతాము అన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గడిచిన 14 నెలలుగా నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని.. ఇప్పటికే ఏడుసార్లు ప్రత్యేకంగా ఈ విమానాశ్రయ నిర్మాణ పనులపై క్షేత్రస్థాయి సమీక్ష నిర్వహించానని తెలిపారు. ఢిల్లీ లో నుంచి కూడా రెండు దఫాలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశానని తెలిపారు. నిర్మాణం పనులు, రన్ వే, టెర్మినల్ బిల్డింగ్ తదితర అంశాలను శరవేగంగా పూర్తి చేసుకొని 86% ప్రోగ్రెస్ తో భోగాపురం వెళుతుందని స్పష్టం చేశారు. వాస్తవానికి ఈ సంవత్సరం సెప్టెంబర్ 10వ తారీఖు కి 79 శాతానికి నిర్మాణ పనులు పూర్తి అవ్వాల్సి ఉండగా ఆ టార్గెట్ కు ముందుగానే నిర్మాణ పనులు ముందుకు వెళ్తూ ఉన్నాయని స్పష్టం చేశారు. వర్షాకాలంలో ఎదురవుతున్న ఇబ్బందులను జిఎంఆర్ సంస్థ ముందుగానే గుర్తించి అందుకు తగ్గట్టుగానే పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. టెర్మినల్ బిల్డింగ్ 79% పనులు పూర్తి చేసుకుందని, యాక్సిస్ రోడ్స్ 68% పనులు పూర్తి చేసుకున్నాయని తెలిపారు. వీటన్నింటిని ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ కన్నా ముందుగానే పూర్తి పటిష్టతతో పూర్తి చేసే దిశగా వెళ్తున్నామని తెలిపారు. విశాఖ పట్నం నుండి విమానాశ్రయంను తీసుకుపోతున్నామన్న ఆందోళన ఎవ్వరికి అవసరం లేదని, స్పష్టమైన కార్యాచరణతో మునుపటికంటే వేగంగా, భోగాపురం విమానాశ్రయానికి చేరుకునే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందుకోసం ముందుగానే ఏడు పాయింట్లను ఎంచుకున్నామని, ఆ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, రోడ్డు విస్తరణ చెయ్యడం వంటి అంశాల ద్వారా మరింత వేగంగా భోగాపురం కు చేరుకునే అవకాశం ఉందని తెలిపారు. విమానాశ్రయానికి రోడ్ కనెక్టివిటిని సైతం పెంచుతున్నామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ డైవర్షన్ రోడ్ ఎక్స్టెన్షన్ ద్వారా విశాఖపట్నం నుంచి సైతం సులభంగా విమానాశ్రయానికి చేరుకునేలా భీమిలి, తాళ్లవలస, పరదేశి పాలెం, ఆనంద పురం, వేపగుంట, వివిధ పాయింట్ల దగ్గర రోడ్డు విస్తరణ, ట్రాఫిక్ తగ్గింపు అంశాలపై దృష్టి సారించామని తెలిపారు. విశాఖపట్నం వాసులు తమ నుంచి ఎయిర్ పోర్ట్ ను దూరంగా తీసుకుపోతున్నారు నా అనుమానం అవసరం లేదని ఈ ఏడు పాయింట్లు క్లియర్ చేయడం ద్వారా మరింత చేరువ అవుతారని అన్నారు. అలాగే విశాఖపట్నం సిటీ నుండి హైవేకు మెట్రో కారిడార్ నిర్మాణం చెయ్యడం చంద్రబాబు దూర దృష్టి కి నిదర్శనం అని అన్నారు. అది కూడా పూర్తయితే మరింత త్వరగా భోగాపురం కు చేరుకునే అవకాశం ఉందని తెలిపారు. వీటితో పాటు భువనేశ్వర్ నుండి విశాఖపట్నం వరకు ఆరు లైన్ల బీచ్ కారిడార్ కోసం కూడా శరవేగంగా స్పష్టమైన డిపిఆర్ తో ముందుకు వెళ్తున్నామని అది పూర్తయితే మరిన్ని బహుళ ప్రయోజనాలు చేరువవుతాయని స్పష్టం చేశారు. వీలున్నంత తీరానికి దగ్గరగా బీచ్ కారిడార్ నిర్మాణం అవుతుందని.. దీనికి డిపిఆర్ కూడా ఆల్రెడీ ప్రిపేర్ అయిందని స్పష్టం చేశారు. భోగాపురం ఎయిర్పోర్ట్ మూడు జిల్లాలకు వినియోగంతో పాటు ఉత్తరాంధ్రకు ఆయువుపట్టుగా నిలుస్తుందని తెలిపిన రామ్మోహన్ నాయుడు.. దేశంలోనే ఎంత అందమైన ఏర్పాటు తాను ఎక్కడ చూడలేదని ఆనందం వ్యక్తం చేశారు. చాలా చక్కగా



నిర్మాణం జరుగుతోందని రామ్మోహన్ నాయుడు తన సంతృప్తిని వ్యక్తం చేశారు. జిఎంఆర్ సంస్థ కూడా స్థానికంగా చెందిన జిఎంఆర్ కు చెందినది కావడంతో మరింత ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా పూర్తిస్థాయి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. స్థానికంగా డ్రైనేజీ, కనెక్టివిటీ రోడ్లు విషయంలో ఫిర్యాదులు అందాయని స్థానిక నాయకత్వం అధికారులకు ఈ సమస్యపై ఇప్పటికే అవగాహన ఉందని.. వీలైనంత వేగంగా వాటిని కూడా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. గతంలో సంవత్సరానికి 36 లక్షల కనెక్టివిటీ తో విశాఖపట్నం ఎయిర్పోర్ట్ ఉండేదని.. కానీ భోగాపురం ఎయిర్పోర్ట్ మొదటి దశ నిర్మాణం పూర్తి అయితే 60 లక్షల కనెక్టివిటీ ఒక సంవత్సరానికి సాధిస్తుందని స్పష్టం చేశారు కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన 2024 జూన్ నాటికి నెలకు రెండు లక్షల 30 వేల మంది విశాఖపట్నం ఎయిర్పోర్ట్ నుంచి వివిధ ప్రాంతాలకు ప్రజలు వెళ్ళేవారని.. తానూ కేంద్ర మంత్రిగా భాధ్యతలు తీసుకున్న తరువాత తీసుకున్న ప్రత్యేక చొరవతో ప్రస్తుతం నెలకు రెండు లక్షల డబ్బై వేలమంది ప్రయాణాలు సాగిస్తున్నారని తెలిపారు. తాను ప్రత్యేకంగా చొరవ తీసుకుని శాభారిమలై కొచ్చికి ఒక సర్వీసును, అదేవిధంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇరువురు గవర్నర్లు కంభంపాటి, అశోక్ గజపతిల సూచనల మేరకు.. భువనేశ్వర్, గోవా లకు సైతం సర్వీసులను ఏర్పాటు చెయ్యడం జరిగిందని అన్నారు. భోగాపురం తాను కేంద్ర మంత్రిగా భాధ్యతలు తీసుకునే సమయానికి కేవలం ఇరవై ఎనిమిది శాతం మాత్రమే పనుల పురోగతి ఉందని, ప్రస్తుతం ఎనభై ఆరు శాతం కు చేరుకుందని తెలిపారు. ఈ డిసెంబర్ కు వ్యాలిడేషన్ ఫ్లైట్ ను రన్ చెయ్యడం జరుగుతుందని స్పష్టం చేశారు. మూల పేట లో పోర్టు, భోగాపురం లో ఎయిర్ పోర్ట్, విశాఖపట్నంలో ఐటి విప్లవం ద్వారా భవిష్యత్ లో ఉత్తరాంధ్ర మరింత వృద్ధి సాధిస్తుందని స్పష్టం చేసిన రామ్మోహన్ నాయుడు.. నారా లోకేష్ ప్రత్యేక చొరవతో అభివృద్ధి మరింత వేగంగా సాగుతోందని స్పష్టం చేశారు. నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారి విషయం లో సైతం నారా లోకేష్ చూపించిన తెగువ ప్రసంశనీయం అని, దాదాపు నలభై ఎనిమిది గంటలకు పైగా ఇదే అంశం పై పూర్తిగా సమీక్షను నిర్వహించి.. యాత్రికుల సమస్యను ఒడ్డుకు చేర్చారని తెలిపారు. వారికి సురక్షితంగా విమాన ప్రయాణాన్ని ఏర్పాటు చేసి క్షేమంగా చేర్చడంలో కేంద్ర మంత్రిగా తన పూర్తి తోడ్పాటును అందించానని తెలిపారు. గతంలో కూడా ఇదే తరహాలో దేశ, విదేశాల్లో యాత్రికులు, తెలుగువాళ్ళు చిక్కుకున్న సమయంలో కూడా ఇదే తరహా స్ఫూర్తిని టిడిపి సర్కారు చూపించిందని స్పష్టం చేశారు. అనంతపురం లో జరిగిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమం ఘన విజయం సాధించిందని, ఇది కూడా జీర్ణించుకోలేని వైసిపి నేతలు.. యధావిధిగా తమపై విషం చిమ్ముతున్నారని ఎద్దేవా చేశారు. బూతులు, రెచ్చగొట్టే మాటల ద్వారా పెట్టుబడిదారులు సైతం భయపడే పరిస్థితికి రాష్ట్రం చేరుకుందని, వారి భయాలను తొలగించే పనిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టారని తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాల్లలో మెరుగైన విద్య కోసం రాష్ట్ర స్థాయి కార్యక్రమాలకు శ్రీకారం

**ఏపీ విద్యాశాఖ మంత్రి కి లేఖ రాసిన సంఘమిత్ర సూరిబాబు**

**విశాఖపట్నం,సెప్టెంబర్ 13(ప్రజాస్వరం):**

సమాజ సేవలో తనదైన ముద్ర వేసిన సంఘమిత్ర సూరిబాబు, రాష్ట్ర విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న విద్యా సంబంధమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని నిర్ణయించి, ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుకు లేఖ రాశారు. దేశాభివృద్ధిలో విద్యే కీలకమైనది పిల్లల వయసు నుండే వారిలో ఉన్న ప్రతిభను వెలికితేయాలి మరియు తల్లి దండ్రులు లేని పిల్లలకి సింగిల్ పేరెంట్ పిల్లలకి మరియు హాస్టల్లో పేద పిల్లలకి ఇప్పిటి నుండే అన్నివిధాలా మంచిట్రైనింగ్ ఇస్తే రాబోయే కాలానికి కాబోయే మంచి వారసులు తయారు అవుతారని చదువుతో పాటు సంస్కారం విద్యతో పాటు విజ్ఞానం నేర్పిస్తే చదువు అబ్బని పిల్లలని కూడ ప్రయోజకలను చెయ్యిచ్చు రాబోయే రోజుల్లో స్వయం కృషి తో బ్రతికెందుకు సరైన మార్గదర్శకత్వం, శిక్షణ, ఉపాధి అవకాశాలు లభిస్తే యువత దేశానికి మంచి సేవలందించగలరని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు సరైన సమాచారం లేమి, ఆర్థిక ఇబ్బందులు, శిక్షణ కేంద్రాల లభ్యత లోపం వంటి కారణాలతో వెనుకబడుతున్నారని, వారి భవిష్యత్తును వెలిగించేందుకు తక్షణ చర్యలు అవసరమని విజ్ఞప్తి చేశారు. “గత 22 సంవత్సరాలుగా మా ‘సంఘమిత్ర సోషల్ సర్వీసస్ దేశానికి మంచి సేవలు అందించడానికి అహర్నిశలు కృషి చేస్తోంది. విద్యార్థులకు అవసరమైన శిక్షణ, ఉపాధి అవకాశాలు అందించేందుకు ప్రత్యేకంగా ‘సంఘమిత్ర మల్టిపుల్ టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్’ చదువు రాని



యువకులు ఏర్పాటు చేశాం. ఇప్పటికే వేలాది మంది విద్యార్థులకు విద్యా సహాయం అందించాం. ప్రభుత్వం సరైన విధంగా ముందడుగు వేస్తే, మరింత మంది విద్యార్థులు ముందడుగు వేయగలరు. చదువు కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పిల్లలకు సహాయం అందించడానికి, ఉపాధికి దారి చూపడానికి మేము పూర్తి నిబద్ధతతో పని చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శిక్షణ కేంద్రాల్లో ఉన్న యువతకు సరైన మార్గదర్శకత్వం అందేలా, విద్యార్థులకు అవసరమైన సాధనాలు, సమాచారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని నేను వినమ్రంగా కోరుతున్నాను.” సంఘమిత్ర సూరిబాబు తన లేఖ ద్వారా విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరచడమే లక్ష్యంగా, విద్యా శాఖతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. అలాగే, సామాజిక బాధ్యతగా విద్యార్థుల చదువు, శిక్షణకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం, సామాజిక సంస్థలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేస్తేనే దేశానికి మంచి మార్పు సాధ్యమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# మత్స్యకారుడి వలకు చిక్కిన వింతైన భారీ చేప

**తిమ్మాపూర్ సెప్టెంబర్ 13(ప్రజాస్వరం):**

కరీంనగర్ జిల్లా, తిమ్మాపూర్ మండలం, రామకృష్ణ కాలనీ గ్రామానికి చెందిన బోల్ల భూమయ్య అనే మత్స్యకారుడి వలలో వింతైన చేప చిక్కింది. వివరాల్లోకి వెళ్తే.. ఎల్ఎండి రిజర్వాయర్‌లో రోజువారి లాగే చేపలు పట్టేందుకు శనివారం వెళ్ళాడు. ఉదయం తన వలలు తీస్తుండగా ఎర్ర రంగులో విచిత్రంగా ఉన్న వెరైటీ చేప భారీ సైజులో కనిపించడంతో పైకి తీసి గమనించాడు. ఇట్లాంటి చేప ఇప్పటివరకు ఎల్ఎండి రిజర్వాయర్లో పడలేదని స్థానిక మత్స్యకారులు తెలిపారు. ఇది ఇతర రాష్ట్రాలకు చెందిన చేపగా పలువురు మత్స్యకారులు, స్థానికులు భావిస్తున్నారు. ఈ వెరైటీ చేపను చూసేందుకు పలువురు ఆసక్తి కనబరిచారు.



# క్రీడల్లో మెరుపులు మెరిపించిన మోడ్రన్ స్కూల్ విద్యార్థులు




**ఉప్పల్, సెప్టెంబర్ 13(ప్రజాస్వరం):**

ఉప్పల్ జోనల్ లెవెల్ ఆధ్వర్యంలో గవర్నమెంట్ స్కూల్ ఉప్పల్‌లో జరిగిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో మోడ్రన్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. మండలానికి చెందిన 35 స్కూళ్లు, 80 జట్లతో నిర్వహించిన ఈ పోటీల్లో మోడ్రన్ స్కూల్ విద్యార్థులు ఖో ఖో విభాగంలో నాలుగు కేటగిరీల్లో మొదటి స్థానాలు దక్కించుకోగా, వాలీబాల్ యు17 గర్ల్స్ విభాగంలో రెండవ స్థానం సాధించారు.

**మోడ్రన్ స్కూల్ విజయాలు**

1వ స్థానం - యు17 బాయ్స్ ఖో ఖో
1వ స్థానం - యు17 గర్ల్స్ ఖోఖో
1వ స్థానం - యు14 బాయ్స్ ఖోఖో
1వ స్థానం - యు14 గర్ల్స్ ఖోఖో
2వ స్థానం – యు17 గర్ల్స్ వాలీబాల్

ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ సచీదేవి మాట్లాడుతూ మా విద్యార్థులు ఆటలలో చూపుతున్న ప్రతిభ పట్ల గర్వంగా ఉంది. జిల్లాస్థాయిలో కూడా ఉత్తమ ఫలితాలు సాధిస్తారని నమ్మకం ఉంది అన్నారు. స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీ ప్రసన్నం మాట్లాడుతూ అబ్బాయిలతో పాటు అమ్మాయిలు కూడా ఆటలలో రాణించడం ఆనందకరం. ఆటలు, వ్యాయామం, చదువు——ఆల్‌రౌండ్ డెవలప్మెంట్ వలన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది అని పేర్కొన్నారు. స్కూల్ చైర్మన్ ముత్యం రెడ్డి మాట్లాడుతూ, “గత కొన్నేళ్లుగా మోడ్రన్ స్కూల్ విద్యార్థులు చదువుతో పాటు ఆటలలోనూ మండల, జిల్లా స్థాయిలోనే కాక రాష్ట్ర, జాతీయస్థాయిలో కూడా అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు” అని అన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు నరేంద్ర, ఉపాధ్యాయ బృందం కృషిని అభినందించారు. అదే విధంగా మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ రామారావు, ఉప్పల్ జిహెచ్‌ఎం శిరీష, జోనల్ ఇంచార్జ్ పద్మావతి, పీడీ శంకర్, మమత విద్యార్థులను శుభాకాంక్షలు తెలిపారు. ఈ పోటీల్లో మోడ్రన్ స్కూల్ నుంచి దాదాపు 100 మంది విద్యార్థులు పాల్గొనడం విశేషం.



## నృత్యాలు సంస్కృతికి చిహ్నాలు



### చిన్నారుల ప్రతిభకు చేయూత అవసరం ఘనంగా జిల్లాస్థాయి డాన్స్ పోటీలు ప్రారంభం

**విశాఖపట్నం, సెప్టెంబరు13(ప్రజాస్వరం):**

విభిన్న నృత్యాలు మనసంస్కృతి, సాంప్రదాయాలకు చిహ్నాలుగా నిలుసు _న్నాయని ముఖ్య అతిథి పేర్కొన్నారు. సీతమ్మధార ఏ.పీ.ఎస్.ఈ.బి. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశ మందిరంలో స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ ప్రజాపిత బ్రహ్మకుమారీస్వరీయ విశ్వవిద్యాలయంల ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే జిల్లాస్థాయి నృత్య పోటీలను ముఖ్యఅతిథిగా శనివారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన చిన్నారుల ప్రతిభకు తగిన చేయూతను అందించి ప్రోత్సహించాల్సి ఉండ న్నారు. గౌరవ అతిథిగా హాజరైన మాట్లాడుతూ మన నృత్యాలు విను వీధుల్లో విశ్వఖ్యాతిని అర్జిస్తున్నాయన్నారు. విశాఖ జిల్లాలో చిన్నారులకు బహుభాషా నృత్యాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్న స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ ను అభినందించారు. విశాఖ జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రతిభ ఆధారంగా విశాఖ జిల్లాకు చెందిన యువ కళాదారులకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు వస్తున్నప్పటికి కూడా ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడం వల్ల వెను కంజ వేస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి వారిని స్వచ్ఛంద సేవా సంస్థలు తగిన విధంగా ప్రోత్సహించాలని కోరారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రస్టీ డాక్టర్. కమల్ జేయిడ్ మాట్లాడుతూ విశాఖలో క్రీడా సాంస్కృతిక ప్రతిభను ప్రోత్సహించటానికి ప్రత్యేక పథకాలు అవసరం అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధి బి. కే. రామేశ్వరి, స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ అంతర్జాతీయ కొరియోగ్రాఫర్ ఆర్. నాగరాజు పట్నాయక్ లు మాట్లాడుతూ రెండు రోజులు పాటు జరిగే ఈ పోటీలలో విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్య లో శాస్త్రీయ, జానపద నృత్య కళాకారులు ఉత్సాహంగా పాల్గుంటున్నరన్నారు. ఈ కార్యక్రమంలో ఏ. పి. ఎస్. ఈ, బి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ కొండ్రు రామారావు, గౌరవ చైర్మన్ సింహాద్రి రాజు, మహిళా విభాగం ప్రెసిడెంట్ సి. సుజని, ప్రముఖ నృత్య దర్శకురాలు డాక్టర్. విజయవేణి, కె. సత్తిరాజు తదితరులు పాల్గున్నారు.




## గుప్త నిధుల కలకలం.. పట్టుకొని దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

**భిక్కనూరు సెప్టెంబర్ 13(ప్రజాస్వరం):**

రాత్రికి రాత్రే ఆగర్భ శ్రీమంతులం కావాలన్న అత్యాశతో, ఎంతో పురాతన చరిత్ర కలిగిన ఆలయ స్థలంలో గుర్తు తెలియని వారు జేసీబీ పెట్టి తవ్వకాలు జరుపుతుండగా పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన శనివారం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే... కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం ర్యాగట్లపల్లి గ్రామంలో కొందరు స్థానికుల సహకారంతో గుప్త నిధుల కోసం జేసీబీని పెట్టి బసవేశ్వరాలయ ప్రాంగణం, ప్రైవేట్ వ్యక్తి భూమిలో ఐదు గజాల లోతు తవ్వకాలు సాగిస్తున్నారు. ఈ విషయం గ్రామస్తులకు సమాచారం అందడంతో పెద్ద ఎత్తున తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి తరలిరాగా, తవ్వకాలు జరుపుతున్న కొందరు పారిపోగా, మరికొందరిని వెంబడించి గ్రామపంచాయతీ కార్యాలయానికి పట్టుకొచ్చి దేహశుద్ధి చేశారు. ఎందుకోసం తవ్వకాలు చేపట్టారని ఏడ పెడ వాయించారు. పరారైన వారి వివరాల కోసం ఎంత అడిగినా వారు మాత్రం సమాధానం చెప్పలేకపోయారు. సుదీర్ఘ చరిత్ర ఉన్న పురాతనమైన ఆలయంలో స్వామివారి విగ్రహం కొద్దిగా ధ్వంసం కావడంతో, అదే స్థలంలో ఆలయాన్ని పున ప్రతిష్టించాలన్న ఉద్దేశంతో, స్వామి వారి విగ్రహాన్ని పక్కనబెట్టి, ఆలయపున నిర్మాణ కోసం గ్రామస్తులంతా చందాలు పోగు చేస్తున్నారు. ఇదే అదునుగా గ్రామానికి చెందిన కొందరితోపాటుగా మెదక్ జిల్లా రామాయంపేట కాట్రి యాల్, భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన వారితోపాటు, వివిధ ప్రాంతాలకు చెందిన వారు గ్యాంగ్‌గా ఏర్పడి తవ్వకాలు సాగిస్తుండగా గ్రామస్తులు వెంబడించి పట్టుకున్నారు. తవ్వకం దారులు ఉపయోగించిన జెసిబి తో పాటు, కారు, ద్విచక్ర వాహనాల పోలీసులు స్టేషన్ కు తరలించారు.

**తొలిసారి స్టేషన్ మెట్లే క్కిన గ్రామస్తులు..**

కేసులు లేని గ్రామంగా గుర్తింపు పొందిన ర్యాగట్లపల్లి గ్రామస్తులు తొలిసారిగా గుప్తనిధుల తవ్వకాల విషయమై పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కడం సంచలనంగా మారింది. గ్రామస్తులంతా ఐకమత్యంగా ఉండి గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టిన వారిని, ముందుగా దేహశుద్ధి చేసి, ఆ తర్వాత పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు భిక్కనూరు ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు గ్రామానికి చేరుకొని, తవ్వకం దారులను అదుపులోకి తీసుకున్నారు. వారిని స్టేషన్‌కు పట్టుకెళ్ళిన వెంటనే, వారి వెనకాలే గ్రామస్తులు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్‌కి వెళ్లి కంప్లైంట్ చేశారు.



## పట్టపగలే దొంగల చేతివాటం.. బైక్ డిక్కీ నుంచి భారీగా నగదు చోరీ

**శంకర్ పల్లి సెప్టెంబర్ 13(ప్రజాస్వరం):**

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టపగలే దొంగలు తమ చేతివాటం ప్రదర్శించారు. అందరూ చూస్తుండగానే.. ద్విచక్రవాహనం డిక్కీలోంచి నగదును ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. ఎర్వగూడ గ్రామానికి చెందిన ప్రదీప్ గౌడ్ అనే వ్యక్తి శంకర్‌పల్లిలోని హనుమాన్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన డ్వాక్రా గ్రూప్‌నకు సంబంధించిన రూ.2.98 లక్షల నగదును యూనియన్ బ్యాంక్‌ను వద్దకు తీసుకెళ్లారు. క్యూలైన్ ఎక్కువగా ఉండటంతో వాహనం డిక్కీలో ఉంచి సమీపంలోనే ఉన్న ల్యాబ్‌లోనే పని చేసుకునేందుకు వెళ్లారు. 15 నిమిషాల తర్వాత వచ్చి వాహనం డిక్కీలో చూస్తే నగదు కనిపించలేదు. వెంటనే అతడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సిసి కెమెరా ఫుటేజీని పరిశీలించారు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు డిక్కీని తెరిచి నగదు తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# రూ. 500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం..

### శంషాబాద్‌లో ప్రభుత్వ భూమి రికవరీ.. హైడ్రా యాక్షన్ – 12 ఎకరాలు స్వాధీనం

**రాజేంద్రనగర్ సెప్టెంబర్ 13(ప్రజాస్వరం):**

ప్రభుత్వ భూముల పరిరక్షణపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ బాధ్యతను చేపట్టిన హైడ్రా టాస్క్‌ఫోర్స్ ఇప్పటికే వందలాది ఎకరాలను స్వాధీనం చేసుకోగా, తాజాగా మరో కీలక విజయాన్ని సాధించింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని శాతంరాయ్ గ్రామంలో రూ.500 కోట్ల విలువైన 12 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడింది.

**ప్రహరీ, షెడ్ల తొలగింపు**

ఇంటర్మీడియట్ బోర్డుకు 2011లో కేటాయించిన ఈ భూమిపై గత కొంతకాలంగా ఆక్రమణ యత్నాలు జరుగుతున్నాయి. "ఈ భూమి మా సొంతం" అంటూ స్థానికంగా ఒక నేతతో పాటు అనీస్ కన్స్ట్రక్షన్స్ అనే సంస్థ హక్కులు క్లెయిమ్ చేస్తూ అక్కడ బోర్డు కూడా ఏర్పాటు చేసింది. అంతేకాక, భూమి చుట్టూ ప్రహరీ కట్టేసి, షెడ్లు కూడా నిర్మించారు. ఈ పరిణామాలపై స్థానికులు, అలాగే ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా రంగంలోకి దిగింది.

**కబ్జాదారుల వాదనలు తిప్పికొట్టిన అధికారులు**

"మేము పాయగా కుటుంబ వారసుల నుంచి ఈ భూమి కొన్నాం, వ్యవసాయం చేస్తున్నాం" అని కబ్జాదారులు చెబుతున్నా, రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. శంషాబాద్ మండలంలో పాయగా కుటుంబ భూములే లేవు. వేరే ప్రాంతానికి చెందిన రికార్డులను ఇక్కడ చూపించి కబ్జా ప్రయత్నం చేశారని తేల్చారు. అంతేకాక, అనీస్ కన్స్ట్రక్షన్స్ అధినేత శ్రీపాద దేశ్ పాండే ఇప్పటికే అనేక భూవివాదాల్లో ఉన్నట్టు హైడ్రాకు సమాచారం అందింది.

అన్ని ఆధారాలు పరిశీలించిన అనంతరం, ఈ 12 ఎకరాలు ప్రభుత్వానికి చెందినవేనని హైడ్రా ధృవీకరించింది. వెంటనే ఆక్రమణలను తొలగించి, భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంది. ఇందులోని ఒక ఎకరం పరిధిలో ఉన్న కొన్ని నివాసాలు, దేవాలయం, మసీదు మాత్రం కాపాడుతూ మిగతా భూమిని ఆక్రమణల నుంచి విముక్తి కల్పించింది. చివరగా, ఆ ప్రాంగణంలో "ప్రభుత్వ భూమి - హైడ్రా పరిరక్షణలో ఉంది" అని బోర్డులు ఏర్పాటు చేసింది.





## గణేష్ నిమజ్జనంలో విషాదం.. ఎనిమిది మంది మృతి

**హసన్ సెప్టెంబర్ 13(ప్రజాస్వరం):**

కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం రాత్రి హసన్ జిల్లాలోని ఒక గ్రామంలో గణేశ నిమజ్జన ఊరేగింపుపైకి ట్రక్కు దూసుకెళ్లడంతో ఎనిమిది మంది మృతి చెందగా, 20 మందికి పైగా గాయపడ్డారని పోలీసు వర్గాలు తెలిపాయి. గణేశ చతుర్థి వేడుకల చివరి రోజు రాత్రి 8.45 గంటల ప్రాంతంలో మోసలే హోసహళ్లి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. మరణించిన వారిలో ఎక్కువ మంది యువకులే ఉన్నారు. గాయపడిన వారిని చికిత్స కోసం హసన్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అరకలగూడు నుండి వస్తున్నట్లు భావిస్తున్న ట్రక్కు నియంత్రణ కోల్పోయి భక్తుల పైకి దూసుకెళ్లిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. లారీ చక్రం కింద చిక్కుకుని దాదాపు నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారని గ్రామస్తులు తెలిపారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

## సాగర్‌కు భారీగా వరద ప్రవాహం.. 26 క్రస్ట్ గేట్లు ఓపెన్

**నాగార్జునసాగర్ సెప్టెంబర్ 13(ప్రజాస్వరం):**

నాగార్జునసాగర్ డ్యామ్ జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాజెక్టులన్నీ నిండుకుండలా మారి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తుండటంతో జలాశయానికి భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. ఎగువ శ్రీశైలం జలాశయం 7 క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 1,93,634 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 66,280 క్యూసెక్కుల నీటిని మొత్తం 2,81,352 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న సాగర్ రిజర్వాయర్‌కు విడుదల చేస్తున్నారు. శనివారం సాయంత్రానికి నాగార్జునసాగర్ డ్యామ్ 26 క్రస్ట్‌గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,09,794 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు గాను ప్రస్తుతం 589.70 అడుగులవద్ద నీరు నిల్వ ఉంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టిఎంసిలు కాగా ప్రస్తుతానికి 311.1486 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 32,764 క్యూసెక్కుల నీటిని, కుడి కాలువ ద్వారా 9,019 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వద్వారా 6,325 క్యూసెక్కుల నీటిని, ఎస్.ఎల్.బి.సి ద్వారా 2,400 క్యూసెక్కుల నీటిని, లోలెవల్ కెనాల్ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని మొత్తం 2,60,602 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

**సాగర్‌కు పర్యాటకుల సందడి**

నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్ల ద్వారా పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ అందాలను చూసేందుకు పర్యాటకులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భారీగా తరలివచ్చారు. కృష్ణమ్మ పరవళ్లు చూసి పర్యాటకులు తమ సెల్ ఫోన్లలో సెల్ఫీలు దిగుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. సాగర్‌లో ఉన్న పర్యాటక ప్రాంతాలైన అనుపు, బుద్ధవనం, కొత్త వంతెన, పాత వంతెన తదితర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది. తెలంగాణ టూరిజం ఏర్పాటు చేసిన లాంచీలో వెళ్లేందుకు పర్యాటకులు ఉత్సాహం చూపారు.



## వివాహేతర సంబంధం.. రెండేళ్ల పాపను చంపి, పూడ్చిపెట్టిన తల్లి

**మెదక్ సెప్టెంబర్ 13(ప్రజాస్వరం):**



మెదక్ జిల్లాలో ఒక దిగ్భ్రాంతికరమైన సంఘటనలో ఒక మహిళ, ఆమె ప్రేమికుడు మూడు నెలల క్రితం తన రెండేళ్ల కుమార్తెను హత్య చేసి, మృతదేహాన్ని శివంపేట మండలం షబాష్‌పల్లి గ్రామ శివార్లలో పూడ్చిపెట్టారు. శుక్రవారం పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్న తర్వాత ఈ నేరం వెలుగులోకి వచ్చింది. దర్యాప్తు అధికారుల ప్రకారం, షబాష్‌పల్లి నివాసి అయిన మమత, సిద్ధిపేట జిల్లాలోని రాయ్‌పోల్‌కు చెందిన భాస్కర్‌ను ఐదు సంవత్సరాల క్రితం వివాహం చేసుకుంది. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే, తన భర్తతో తీవ్ర విభేదాల కారణంగా ఈ సంవత్సరం మార్చిలో మమత తన పిల్లలతో కలిసి తల్లిదండ్రుల ఇంటికి తిరిగి వచ్చింది. గ్రామంలో ఉంటున్న సమయంలో, ఆమె స్థానికంగా నివసించే ఫయాజ్‌తో సంబంధం ప్రారంభించింది. జూన్ 7న, మమత తన చిన్న కుమార్తె తనుశ్రీతో కలిసి కనిపించకుండా పోయింది. అదే రోజు ఫయాజ్ కూడా అదృశ్యమయ్యాడు. దీని తర్వాత, మమత తండ్రి రాజు శివంపేట పోలీస్ స్టేషన్‌లో కనిపించకుండా పోయిన ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో మమత, ఫయాజ్ గుంటూరు జిల్లాలోని నరసరావుపేటలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విచారణలో, జూన్ 7న తనుశ్రీని హత్య చేసి, గ్రామ శివార్లలో ఆమె మృతదేహాన్ని పూడ్చిపెట్టినట్లు వారు అంగీకరించారు. శుక్రవారం వైద్యుల సమక్షంలో మృతదేహాన్ని బయటకు తీశారు మరియు ఫోరెన్సిక్ పరీక్షల కోసం నమూనాలను సేకరించారు. తదుపరి దర్యాప్తు జరుగుతోంది మరియు పోలీసులు ఈ కేసు గురించి తరువాత మీడియాకు వివరిస్తారని భావిస్తున్నారు.

## గద్వాలకు ఏ మొహం పెట్టుకుని వచ్చావ్..!

### కేటీఆర్ పై కాంగ్రెస్ నేత సంపత్ కుమార్ ఫైర్


**అలంపూర్ సెప్టెంబర్ 13(ప్రజాస్వరం):**



గద్వాలకు ఏ మొహం పెట్టుకుని వస్తావ్ అంటూ కేటీఆర్ పై కాంగ్రెస్ నేత సంపత్ కుమార్ ఫైరయ్యారు. బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం గద్వాల జిల్లా కేంద్రంలో తలపెట్టిన గద్వాల గర్జన సభకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. అధికార పార్టీకి చెందిన పలువురు కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరనున్నారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ మాట్లాడుతూ... పదేళ్ల బిఆర్ఎస్ పాలలో చేనేత శాఖ మంత్రిగా ఉన్న ఆయన గద్వాలలో టెక్స్టైల్ పార్కు ఏర్పాటు చేస్తామని చెప్పి చేనేత కార్మికులను మోసం చేశాడని ధ్వజమెత్తారు. శంకుస్థాపన చేసిన శిలాఫలకం చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచాయని కేటీఆర్ వెళ్లి చూడాలని డిమాండ్ చేశారు. తుమ్మిళ్ల ప్రాజెక్టును పూర్తి చేస్తానని చెప్పి సగం సగం పనులు చేసి పోయారని ఆరోపించారు. సరైన సౌకర్యాలు కల్పించకుండానే వంద పడకల ఆసుపత్రికి రిబ్బన్ కటింగ్ చేసి పోయారని మండిపడ్డారు. పదేళ్లలో గద్వాల జిల్లా పరిధిలోని నాలుగు మునిసిపాలిటీలకు ఒక్క రూపాయి నిధులు కూడా ఇవ్వలేదన్నారు రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలనలో వంద పడకల ఆసుపత్రిని అన్ని సౌకర్యాలతో తిరిగి ప్రారంభించుకుందాం అని గుర్తు చేశారు. తమ సర్కారు హాయంలో మల్లమ్మకుంట సర్వే పనులు ప్రారంభమైమయ్యాయని అన్నారు. రూ.120 కోట్లతో జూరాలపై కొత్త బ్రిడ్జిని నిర్మిస్తున్నామని తెలిపారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను ఆడ, మగ అంటూ కామెంట్ చేస్తున్నారని వారికి టికెట్ ఇచ్చినాడు కేటీఆర్ కు ఏ లింగమో తెలియదా అని ప్రశ్నించారు.తాను కాంగ్రెస్ విప్ గా ఉన్నప్పుడు తమ పార్టీ ఎమ్మెల్యేలను ఐదుగురిని టిడిపి ఎమ్మెల్యేలను 15 మందిని టిఆర్ఎస్ లో చేర్చుకున్నారని మండిపడ్డారు.బిఆర్ఎస్ వాళ్ళు చేస్తే సంసారం... తాము చేస్తే

## 10 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత

**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 13:(ప్రజాస్వరం ):**



అక్రమంగా నిల్వ ఉంచిన 10 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన శనివారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, ఆదిబట్ల మున్సిపాలిటీ, మంగల్ పల్లి గ్రామంలో పీడీఎస్ బియ్యం నిల్వచేసినట్లు పోలీసులకు పక్కా సమాచారం రావడంతో వెంటనే అక్కడకు చేరుకొని రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నామని, పట్టుబడిన బియ్యాన్ని సివిల్ సప్లై వారికి అప్పగించామనీ తెలిపారు. ఎవరైనా అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా బియ్యం తరలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.


EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999